క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

తంబళ్లపల్లె : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు మునికుమార్, ఆశాలత తెలిపారు. గురువారం గోపిదిన్నె, రేణుమాకులపల్లెలో నిర్వహించిన వైద్య శిబిరంలో 80 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. జ్వరాల బారిన పడిన వారికి వైద్య చికిత్సలు చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు భారతి, సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం, నాటుసారాను అరికడతాం

మదనపల్లె : మదనపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాటు సారా తయారీ, కర్నాటక మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తానని ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 5 మండలాలతో పాటు మదనపల్లె మున్సిపాలిటీ 10, రూరల్ 4, నిమ్మనపల్లె 1, రామసముద్రం 1, కురబలకోట 3, బి.కొత్తకోట 3 మద్యం దుకాణాలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయిందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9 వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

మహాసభకు తరలిరండి

వాల్మీకిపురం : రాయచోటిలో ఈ నెల 6న జరిగే ధర్మ యుద్ధ మహాసభకు మాలలంతా తరలిరావాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలో జరిగే మహాసభలో మాలలంతా కలసి కట్టుగా పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగార్జున, నాయకులు అశోక్, వెంకటస్వామి, గాంధీపేట సుధాకర్, శ్రీనివాసులు, అనిల్, రమణ, బాబు, కుమార్ పాల్గొన్నారు.

పర్యాటకం గ్రంథావిష్కరణ

మదనపల్లె సిటీ : స్థానిక ఇందిరానగర్‌లో గురువారం ప్రముఖ రచయిత, ఇంటర్మీడియట్ బోర్డు రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ ఆలపర్తి పిచ్చియ్యచౌదరి రచించిన పర్యాటకం గ్రంథావిష్కరణ చేశారు. గ్రంథాన్ని ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి గ్రంథ ఆవశ్యకతను వివరించారు. రచయిత తన అనుభవాలను దేవాలయాలు, ప్రముఖ పర్యాట కేంద్రాల గురించి క్షుణంగా వివరించారని తెలిపారు. కార్యక్రమంలో బోయపాటి దుర్గాకుమారి, శ్రీనివాసులునాయుడు, దుర్గాకుమారి, ఝాన్సీరాణి, గంగయ్యచౌదరి, సునంద పాల్గొన్నారు.

స్తంభం నుంచి పడి గాయాలు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన శ్రీభమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఈశ్వరయ్య గురువారం విద్యుత్ స్తంభం నుంచి కింద పడి గాయపడ్డాడు. విద్యుత్‌దీపాలు వెలగకపోవడంతో స్తంభం ఎక్కి దీపాలను మరమ్మతు చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి కిందపడ్డాడు. గుర్తించిన ఆలయ సిబ్బంది తంబళ్లపల్లె సీహెచ్‌సీ తరలించారు. బాధితుడిని మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

వాల్మీకిపురం : వృద్ధుల ఆరోగ్యం పట్ల వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రద్ధ వహించాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. గురువారం స్థానిక చౌడేశ్వరి దేవి వృద్ధాశ్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్ది ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని, ఎప్పటికప్పుడు తొలిదశలో వాటిని గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి గంగరత్న పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

పీలేరు : పుంగనూరుకు చెందిన ఆరేళ్ల చిన్నారి అస్పియ మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి పీలేరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీతో అస్పియకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 29న అదృశ్యమైన అస్పియ మూడు రోజుల తరువాత పుంగనూరు వద్ద సమ్మర్ స్టోరేట్ నీటిలో శవమై తేలడం బాధాకరమన్నారు. చిన్నారి మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రామసముద్రం : రామసముద్రం మండలం అరికెల హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని మధులత రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గురునాథం తెలిపారు. ఈనెల 1న గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగే అండర్-17 వాలీబాల్ బాలిక విభాగంలో మధులత ప్రతిభ కనభరిచినట్లు తెలిపారు. మధులతను పాఠశాల హెచ్‌ఎం , ఎస్ఎంసీ చైర్మన్ భువనేశ్వర్‌రెడ్డి, పీడీ వంశీకృష్ణ అభినందించారు.

పరుగు పందెంలో బంగారు పతకం

కురబలకోట : తిరుపతి ఐఐటీ నిర్వహించిన సస్‌యోగ్-24 పోటీలలో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి వై. వెంకటయ్య వంద మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. హెచ్ నరేంద్ర డిస్కత్రో మూడవ బహుమతి, బ్యాడ్మింటన్‌లో బి. ఆమోస్, కె. హేమంత్ కుమార్ రావు, ఎస్. అబ్దుల్ ముకీత్, కె. దిలీప్‌కుమార్, చందు రన్నర్‌గా నిలిచారని తెలిపారు.

దేవీ వైభవం

- ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

మదనపల్లె సిటీ : శరన్నవరాత్రి ఉత్సవాలు మదనపల్లె పట్టణంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఉదయం అర్చకులు సతీష్‌శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. సాయంత్రం అమ్మవారికి పసుపు అలంకారంలో అమ్మవారికి అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొగటవీరక్షత్రియ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా భక్తులకు పసుపు, కంకుమ, గాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పురాణం చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకుని అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ ఉదయం స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని శ్రీ కామాక్షిదేవి అలంకారంలో భక్తులను ఆకట్టుకుంది. స్థానిక సీటీఎం రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మూలవర్లకు అర్చకులు గోవర్ధన్ అభిషేకం నిర్వహించారు. స్థానిక భువనేశ్వరినగర్‌లో వెలసిన అమ్మవారి ఆలయంలో అమ్మవారి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక కోర్టు ఆవరణంలోని అమ్మవారికి పసుపు అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో అమ్మవారు

జిల్లాలో అత్యంత పేరుప్రఖ్యాతులుగాంచిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రంగురంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, కలశస్థాపన, దుర్గాసప్తశతి పారాయణం, మహామంగళహారతి నిర్వహించారు.



కలికిరి: సోమేశ్వరాలయంలో కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

స్థానిక ఎస్‌బిఐ కాలనీ, గొల్లపల్లిరింగ్‌రోడ్డు, రామారావుకాలనీ, సీటీఎం రోడ్డు, శివాజీనగర్‌కు చెందిన భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అమ్మవారిని మీనాక్షి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నల్లవీరగంగాభవాని అమ్మవారి ఆలయంలో..

వాల్మీకిపురం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శ్రీ నల్లవీరగంగాభవాని అమ్మవారి ఆలయంలో గంగాభవాని అమ్మవారు త్రిపుర సుందరి దేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు బాలత్రిపురసుందరిగా, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో చాముండేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని గండబోయనపల్లిని సత్యమ్మ తల్లి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా, వాల్మీకిపురం పంచాయతీ గొళ్లపల్లిలో విరూపాక్షమ్మ తల్లి ఆలయంలో బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవార్లను ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కువైట్ శంకరాచారి, రమణా రెడ్డి, పులి సత్యారెడ్డి, సతీష్, అర్చకులు జనార్దన్, ఉత్తన, శీనాస్వామి, సుధీర్, భక్తులు పాల్గొన్నారు.

బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి శ్రీ బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన గురువారం శ్రీ రెడ్డెమ్మతల్లితో పాటు గుర్రంకొండ గ్రామదేవత శ్రీపోలేరమ్మ తల్లి, శ్రీ గంగమ్మతల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను రంగు రంగుల పుష్పాలతో, పట్టుచీరలు, దివ్యాభరణాలతో శోభయమానంగా అలంకరించారు. షోడశ విద్యకు అధిష్టాన దేవత అయిన బాలత్రిపురసుందరీదేవిని ఆరాధిస్తే నిత్య సంతోషం కలుగుతుందని అర్చకులు అమ్మవారి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

దసరా వేడుకలు ప్రారంభం

రామసముద్రం : మండలంలోని అమ్మవారి ఆలయాలలో గురువారం ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి, గుంతయంబాడి, గంపనపల్లె, గుంతలపేట, కొండూరులోని శ్రీచౌడేశ్వరి అమ్మవారి ఆలయం, తిరుమలరెడ్డిపల్లి గ్రామంలోని మారెమ్మ , సీతారామాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రజత కవచాలంకారంలో ఎల్లమ్మ

కలికిరి : దసరా నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా ప్రారంభమాయ్యయి. కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు గురువారం ఎల్లమ్మ రజత కవచాలంకారంలో బాలత్రిపురసుందరిగా భక్తులకు దర్శన మిచ్చారు.

పట్టణంలో వెలసిన సోమేశ్వరాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేసి లలితా సహస్ర నామ కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి బాలత్రిపుర సుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు.

వాసవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి

పీలేరు రూరల్ : విజయదశమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక నెహ్రూబజార్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి వాసవిదేవి అలంకారంలో మొదటి రోజు దర్శనమిచ్చారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో శ్రీ యల్లమ్మ అమ్మవారికి గురువారం దుర్గాదేవి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



వాల్మీకిపురం: బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



గుర్రంకొండ: బాలత్రిపుర సుందరీ దేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి



రామసముద్రం: ప్రత్యేక అలంకారంలో శ్రీచౌడేశ్వరిదేవి



కలికిరి: రజిత కవచాలంకారంలో ఎల్లమ్మ తల్లి



మదనపల్లె సిటీ: బాలత్రిపుర సుందరీ దేవి అలంకారంలో వాసవీ మాత



పీలేరు రూరల్ : వాసవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

పంచాయతీ అభివృద్ధికి కృషి చేద్దాం

పీలేరు : కలసికట్టుగా పని చేసి పీలేరు అర్బన్ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేద్దామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యక్రమంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ పీలేరులో దోమల బెడద ఎక్కువగా ఉందని, ఫాగింగ్ నిర్వహించాలని, తాగునీరు, వీధి లైట్లు, మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని కోరారు. స్పందించిన ఈఓ గురుమోహన్ మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయంలో పాలన గాడి తప్పిందని, తాను బాధ్యతలు స్వీకరించిన అనంతరం దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 3.29 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 71 లక్షలు వచ్చాయని, జనరల్ ఫండ్ రూ. 21.63 లక్షలు ఉందని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, వార్డు మెంబర్లు ఉదయ్‌కుమార్, శ్రీనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటరమణారెడ్డి, కాలేషా, రమణ, అబీద్, హబీబ్‌బాషా పాల్గొన్నారు.

సమిష్టి కృషితో పంచాయతీల అభివృద్ధి

కేవీపల్లె : సమిష్టి కృషితో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఈఓపీఆర్‌డీ గఫూర్ అన్నారు. గురువారం మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గ్రామాలలో చేపట్టాల్సిన పనులు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను తమ దృష్టికి తేవాలని కోరారు. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మదనపల్లె : గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని చీకలబైలులో సర్పంచ్ ప్రభాకర్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీపీఓ ధనలక్ష్మి మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో భాగస్వామ్య ప్రణాళికను పెంపొందించడం, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (పీడీపీ) సకాలంలో రూపొందించడం లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. గ్రామసభల్లో జరిగిన చర్చ ఆధారంగా నిధులు మంజూరవుతాయన్నారు. గ్రామసర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ 15వ ఆర్థికసంఘం నిధులతో గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు వేయొద్దని ఫిర్యాదు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని ఐటీఐ ఎదురుగా ఉన్న పాతకాలేజీ మైదానంలో రోడ్డు ఏర్పాటు చేయకూడదని స్థానికులు, గణేష్‌యూత్ సభ్యులు గురువారం తహసీల్దార్ హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పాత కాలేజీ మైదానం చుట్టూ ఐటీఐ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఎమ్మార్సీ, దేవాదాయశాఖ, విద్యుత్‌శాఖ కార్యాలయాలనున్నాయని తెలిపారు. ఈ మైదానంలో జనసంచారంతో పాటు పిల్లలు ఆడుకుంటున్నారని తెలిపారు. కొత్తగా నిర్మించిన సివిల్ సప్లయ్ గోడౌన్‌కు మైదానంపై రోడ్డు ఏర్పాటు చేసేందుకు సంబంధింత కాంట్రాక్టర్ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డు ఏర్పాటు వలన వాహన రాకపోకలతో ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని తహసీల్దార్‌కు వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మణి, స్థానికులు చంద్రశేఖర్, బాలకృష్ణ ఉన్నారు.

మండల మీట్ వాయిదా

పెద్దమండ్యం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం రెండవసారి వాయిదా పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి ఆగస్టు 29న మండల మీట్ నిర్వహించాలని అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రెండవసారి అక్టోబర్ 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహణపై అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు, అధికారులకు సమాచారం అందించారు. అయితే నియోజకవర్గంలోని ఇతర మండలాలలో రెండవసారి మండల మీట్‌లను కూటమి నాయకులు అడ్డుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్‌ఐ బందోబస్తు వెళ్లడంతో శాంతి భద్రతల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు అధికారులు గురువారం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చారు.

మదనపల్లెలో 76 మి.మీ.ల వర్షపాతం

మదనపల్లె : మదనపల్లె డివిజన్‌లో అత్యధికంగా మదనపల్లెలో 76 మి.మీ.లు, రామసముద్రంలో అత్యల్పంగా 1.2 మి.మీ.ల వర్షపాతం నమోదైందని సబ్ కలెక్టరేట్ డీవైఎస్‌ఓ శేషయ్య తెలిపారు. గురువారం సబ్ కలెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో.. మదనపల్లె 76మి.మీ., కురబలకోట 40.2, బి.కొత్తకోట 10.2, వాల్మీకిపురం 11.2, రామసముద్రం 1.2 మి.మీల వర్షపాతంకురిసిందన్నారు.

తపాలా సిబ్బంది నిరసన

పెద్దతిప్పసముద్రం : స్థానిక సబ్ పోస్టాఫీసు ఎదుట తపాలా సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌పీఎం రాజారెడ్డి, ఏఐజీడీఎస్‌యూ మదనపల్లి బ్రాంచి యూనియన్ సెక్రటరీ శివప్రసాద్ మాట్లాడుతూ తపాలా సిబ్బందికి గతంలో డీఏలు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లు మంజూరైన సమయాల్లో మాత్రమే పని ఒత్తిడి ఉండేదని తెలిపారు. సిబ్బందిని మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పని ఒత్తిడి తగ్గించి ఊరట కలిగించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం టీటీడీ ఆధ్వర్యంలో పవిత్ర ప్రతిష్ఠ, వాసుదేవ ఆరాధన, కలశస్థాపన, శాంతి హోమాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రంగులరంగుల పుష్పాలతో స్వామివారి అలంకరించారు. పలు రకాల నైవేద్యాలను స్వామివారికి సమర్పించారు. ఉత్సవాలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



స్వామిని పుష్పాలతో అలంకరించిన అర్చకులు

ఇసుక అక్రమరవాణా అరికట్టాలి

మదనపల్లె : అన్నమయ్యజిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమరవాణా అడ్డూ అదుపులేకుండా యథేచ్ఛగా జరుగుతోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇసుక అక్రమరవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇసుకరీచ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి ప్రభుత్వం రాజంపేట నియోజకవర్గంలో ఇసుకరీచ్ ఏర్పాటు చేసిందని, మిగతా ఐదునియోజకవర్గాల్లో ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. దీంతో మిగిలిన నియోజకవర్గాల్లో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా జరుగుతోందన్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇసుకరీచ్‌లు ఏర్పాటు చేసి, అక్రమరవాణాకు అడ్డుకట్టవేయాలని కోరారు. భవననిర్మాణ కార్మికులకు ఇసుక అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

మద్యం దుకాణాలు పాఠశాలలకు దూరంగా ఉండాలి

పీలేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మద్యం పాలసీ విధానంలో భాగంగా మద్యం దుకాణాలు విద్యాలయాలకు, ఆలయాలకు, మసీదులకు, చర్చిలకు దూరంగా ఉండేలా చూడాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ సీఐ సి.హెచ్. వెంకటసుబ్బారెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి పారదర్శకత పాటిస్తూ నియమ నిబంధనలు వంద శాతం అమలు జరిగేలా మద్యం పాలసీ రూపొందించాలని కోరారు. జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి సంపత్, మునాఫ్ పాల్గొన్నారు.

క్రీడల్లో నవోదయం

- క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ
- జాతీయస్థాయి పోటీల్లో సత్తా

మదనపల్లె సిటీ : నవోదయ విద్యాలయంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తున్నారు. ఆటల్లో రాణిస్తే భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవచ్చునని ఇక్కడి విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు. క్లస్టర్, రీజనల్, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ విద్యాలయానికి పేరు, ప్రఖ్యాతులు తీసుకొస్తున్నారు. ఒకవైపు చదువుతో పోటీ పడుతూనే మరో వైపు ఆటల పోటీల్లో రాణిస్తూ పతకాల పంట పండిస్తున్నారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ల ప్రోత్సాహంతో విజయ కేతనం ఎగురవేతస్తూ విద్యాలయానికి గుర్తింపు తెస్తున్నారు.



షాట్‌పుట్ పోటీల్లో పాల్గొన్న నవోదయ విద్యాలయ విద్యార్థులు (ఫైల్)

పరుగు పందెంలో రాణిస్తున్న సిద్దార్థ



పరుగు పందెం పోటీల్లో పదో తరగతికి చెందిన సిద్దార్థ రాణిస్తున్నారు. పరుగు పోటీల్లో క్లస్టర్, ప్రాంతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం నిలిచాడు. జాతీయ స్థాయిలో దేశంలోని అన్ని నవోదయ విద్యాలయాలతో పోటీ పడి మొదటి స్థానం నిలిచారు. రన్నింగ్‌పై ఉన్న ఇష్టమే తనను జాతీయ స్థాయి క్రీడాకారుడిని చేసింది. మెళుకువలు నేర్చుకుని జాతీయ స్థాయి క్రీడాకారుడిని రాణిస్తాను. – సిద్దార్థ, పదోతరగతి, జేఎన్‌వి, మదనపల్లె

డిస్కత్రోలో దిట్ట ఫారియాఖానం



డిస్కత్రోలో ఫారియాఖానం ప్రతిభ చాటుతోంది. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇటీవల నవోదయలో జరిగిన క్లస్టర్, ప్రాంతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం నిలిచింది. రాంచీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో మూడవ స్థానం దక్కించుకుంది. మంచి క్రీడాకారునిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే లక్ష్యమన్నారు. – పి.ఫారియాఖానం, ఇంటర్ సంవత్సరం, జేఎన్‌వి,మదనపల్లె.

షాట్‌పుట్‌లో హారతి ప్రతిభ



షాట్‌పుట్ క్రీడలో హారతి ప్రతిభ చూపుతోంది. పదో తరగతి చదువుతున్న హారతి మొదటి నుంచి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోంది. పీడీల ప్రోత్సాహంతో క్లస్టర్, ప్రాంతీయ స్థాయి పోటీల్లో మొదటి స్థానం నిలిచింది. రాంచీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. క్రీడలతో పాటు చదువుతో కూడా రాణిస్తోంది. – హారతి, పదో తరగతి, జేఎన్‌వి, మదనపల్లె

రాణిస్తున్న సాంబశివారెడ్డి



క్రీడలపై ఆసక్తితో జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు సాంబశివారెడ్డి. గత నెలలో జరిగిన క్లస్టర్ స్థాయి పోటీల్లో 400 మీటర్ల హార్డిల్స్‌లో ప్రతిభ చాటాడు. రీజనల్ స్థాయిలో ప్రథమస్థానం నిలవడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్‌ఐకి ఎంపికయ్యాడు. వచ్చే నెలలో జరిగే పోటీల్లో శిక్షణ పొందుతున్నాడు. – సాంబశివారెడ్డి, ఇంటర్మీడియట్, జేఎన్‌వి, మదనపల్లె